# తండ్రి గారి సందేశం....



## పునరుత్థానానికి బైబిల్ ఆధారాలు

**క్రీస్తు నాథుని యందు ప్రియ సహోదరీ సహోదరులారా!**

ప్రియ సహోదరీ సహోదరులారా, మనం ఏప్రిల్ 17వ తేదీన పునరుత్థాన పండుగను కొనియాడాము. యేసు ప్రభు పునరుత్థాన పండుగ సందర్భంగా ఆయన పునరుత్థానం గురించి పరిశుద్ధ గ్రంథం ఆధారంగా ఏడు సాక్ష్యాధారాలను పరిశీలిద్దాం.

**1. ఖాళీ సమాధి** (మత్తయి 27:62–28:15; మార్కు 16:1–6; లూకా 24:1–8; యోహాను 20:1–10): యేసు ప్రభు తిరిగి లేచినందున ఆయన శరీరాన్ని ఉంచిన సమాధి ఖాళీ అయ్యింది. యేసు ప్రభు పునరుత్థానం జరిగిన సమయంలో యెరూషలేములో ఉన్న ఎవరైనా ఆ సమాధిని సందర్శించి, అది ఖాళీగా ఉందని ధృవీకరించుకోవచ్చు. పునరుత్థానం జరిగిన వెంటనే ఆ విషయాన్ని యేసు ప్రభు అనుచరులు అంతటా వ్యాప్తి చేసినట్లు పరిశుద్ధ గ్రంథంలో నమోదు చేయబడింది. అంతేకాక, ఆ సమాధికి కాపలాదారులను నియమించి రోమా సామ్రాజ్య ముద్ర వేసారు. ఏ శరీరము లేని సమాధికి కావలి ఉండడానికి సైనికులు శ్రద్ధ చూపించి ఉండేవారు కాదు. యేసు అనుచరులు శరీరాన్ని దొంగిలించారని రోమా నాయకులు, ఉన్నత స్థాయిలోని యూదా అధికారులు ఆరోపించడం ద్వారా, నిందారోపణ చేయడం ద్వారా ఆ సమాధిలో యేసు శరీరం ఉండింది అని, తాము ఆ వాస్తవంతో ఏకీభవిస్తున్నామని వారు చెప్పకనే చెప్పినట్లయింది. యేసు ప్రభు మరణించే సమయంలో భయముతో దాగుకున్న శిష్యులు ఆయన శరీరాన్ని దొంగలించారన్న ఆరోపణ నమ్మశక్యం కాదు. యేసుప్రభు తిరిగి లేచారు. కాబట్టి, ఆ సమాధి ఖాళీగా ఉంది.

**2. యేసు మృతులలో నుండి లేచాడన్న సత్యానికి మొట్టమొదటి సాక్ష్యులు స్త్రీలేనని బైబిలు చెబుతోంది** (మత్తయి 28:1–10; లూకా 23:55–24:11; మార్కు 16:1–11; యోహాను 20:11–18). సజీవుడైన యేసుకు మొదటి సాక్షి స్త్రీలేనని యేసు శిష్యులు, అనుచరులు ప్రకటించడం చాలా ఆశ్చర్యకరమైన విషయము. ఎందుకంటే, యేసు ప్రభు జీవించిన సమయంలో యూదా సంస్కృతిలో ఒక స్త్రీ సాక్ష్యం గౌరవించబడేది కాదు. న్యాయస్థానంలో స్త్రీల సాక్ష్యం చెల్లదు. శిష్యులు ఒక వేళ యేసు తిరిగి లేచాడన్న సత్యాన్ని కుట్రపూరితంగా సృష్టించి ఉంటే, అందరు నమ్మదగిన వాదనను వారు చెప్పాలనుకుంటే, యేసును చూసిన మొదటి వ్యక్తిగా బహుశా ఒక ప్రముఖ వ్యక్తిని గాని, పురుషుని గాని చెప్పియుండాలి. కానీ, యేసును మళ్ళీ సజీవంగా చూసిన మొదటి వారు స్త్రీలు అని సువార్తలు చెప్పడం, యేసు ప్రభు పునరుత్థానం నిజమని, అది కల్పితం కాదని బలంగా సూచిస్తోంది.

**3. యేసుప్రభు తన అనుచరుల్లో చాలా మందికి ప్రత్యక్షమయ్యాడు.** (మత్తయి 28:16-17; మార్కు 16:9-11; మారు 16:12; మార్కు 16:14-18; లూకా 24:13-35; లూకా 24:36-43; యోహాను 20:11-18; యోహాను 20:19-29; యోహాను 21:1-23; అపోస్తలుల కార్యములు 1:3-11; అపోస్తులుల కార్యములు 9:1-6, 1 కొరింతీ 15:5-8). ఒకేసారి 500 కంటే ఎక్కువ మంది పునరుత్థానుడైన యేసుప్రభును చూసారని బైబిలు చెబుతోంది. యేసు ప్రభువును శత్రువుగా భావించి, యేసుప్రభు అనుచరులను అతి క్రూరంగా హింసించిన సౌలు అనే వ్యక్తికి కూడా యేసుప్రభు దర్శనమిచ్చారు. ఆ సౌలే (పౌలు) యేసుప్రభు పునరుత్థానుడు అయ్యాడని నలుదిశలా ప్రకటించాడు. పునరుత్థానుడైన యేసుప్రభు అపోస్తలుడైన పౌలు గారితో కలిపి 12 సార్లు ప్రజలకు దర్శనమిచ్చాడు. పురుషులు మరియు మహిళలకు, వ్యక్తులకు, ఇద్దరికి, సమూహాలకు ఇలా అనేక సందర్భాల్లో పునరుత్థానుడైన యేసుప్రభు దర్శనం లభించింది. ఆ దర్శనాలు ఇంటి లోపల, బయట, వేర్వురు ప్రదేశాల్లో, రోజులో వేర్వేరు సమయాల్లో జరిగాయి. యేసు ప్రభును వారు భౌతికంగా చూసారు, విన్నారు, వారి సమక్షంలో ఆయన ఆహారం తిన్నాడు. యేసు మృతులలో నుండి లేచే ముందు యేసుప్రభు నిజంగా మృతులలో నుండి లేస్తాడని ఈ సాక్షులెవరూ నమ్మలేదు. మరణానికి ముందు వారందరితో ఉన్న అదే యేసు ప్రభు, సిలువపై మరణించిన అదే యేసు, పునరుత్థానుడై వారి మధ్యలో ఉన్నారని వారు తమకు తాముగా చూసి, విని నమ్మారు.

**4. యేసు పునరుత్థానానికి ముఖ్య సాక్షుల్లో చాలా మంది పునరుత్థానం చేయబడ్డాడనే సత్యాన్ని ప్రకటించినందుకు మరణించారు.** యేసు పునరుత్థానుడయ్యాడన్న ఆ సత్యాన్ని ప్రకటించే విషయంలో వారు వెనక్కి తగ్గినట్లయితే వారి జీవితాలు బహుశా రక్షించబడేవి. సాధారణంగా, ఎవరైనా ఏదైనా ఒక కారణం కోసం చనిపోతారని మనకు తెలుసు. వీరు పునరుత్థానమనే సత్యం కొరకు హతసాక్షులయ్యారు. వాస్తవం అవాస్తవమని చెప్పడానికి బదులుగా వారు మరణించడానికి సిద్ధమయ్యారు. పునరుత్థానం ఏదైనా కల్పిత కథో, మాయో, ఏదైనా ఊహజనితమైన విషయము అయి ఉంటే బహుశా వారు అంతగా తెగించే వారు కారు. యేసు సిలువ వేయబడడం, పునరుత్థానుడవడం వంటివి వాస్తవాలు కాబట్టి అది నిజమని వారు ప్రకటించినందుకు వారు చనిపోయారు.

**5. కొన్ని ఆధారాలు ఈ సత్యాన్ని ప్రకటిస్తున్నాయి:** సమాధి ఖాళీగా ఉంది, యేసు ప్రభు శరీరం చుట్టబడిన బట్టలు చక్కగా మడతబెట్టి ఉన్నాయి, సమాధి మూయబడిన రాయి దొర్లించబడింది, దొంగలించబడింది అనబడే యేసు శరీరము ఎన్నడూ కనుగొనబడలేదు, సమాధికి సైనికులను కాపలాగా ఉంచారు, మరియు యేసు ప్రభు మృతదేహాన్ని దొంగిలించినట్లు ఎవరూ ఎప్పుడూ ప్రకటించలేదు. యేసుప్రభు శరీరాన్ని చుట్టి ఉంచిన బట్టలు మడతబెట్టి ఉండడం ద్వారా దొంగతనం జరిగింది అనే వాస్తవం దానంతట అదే అవాస్తవం అని తెలియజేస్తుంది.

**6. యేసు మరణించి, సమాధి చేయబడి పునరుత్థానుడైన ఆ పరిసర ప్రాంతాల్లోని అనేకులు క్రైస్తవ విశ్వాసాన్ని స్వీకరించారు.** ఇది శ్రద్ధగా గమనించాల్సిన విషయం. (అపోస్తులుల కార్యముల గ్రంథము). ఆయన మరణించి పునరుత్థానం చేయబడిన కొన్ని వారాలలోనే క్రైస్తవ్యం విస్తృతంగా పెరిగింది. (అపోస్తులుల

కార్యములు 2,41) ఇంకొక ప్రాముఖ్యమైన విషయం ఏమిటంటే యేసుప్రభు మరియు ఆయన శిష్యుల పట్ల వ్యతిరేకత మరియు హింస తీవ్రంగా ఎదురైనప్పుడే అనేకులు క్రైస్తవ్యాన్ని స్వీకరించారు. “పిమ్మట వారు అపోస్తలులను లోనికి పిలిపించి కొరడాతో కొట్టించి, మరల యేసు పేరిట బోధింపరాదని ఆజ్ఞాపించి వదలివేసిరి. యేసు నామము కొరకు అవమానములు పొంద యోగ్యులమైతిమి అని వారు సంతోషముతో ఆ విచారణ సభ నుండి వెడలి పోయిరి. ప్రతి రోజు వారు దేవాలయములోను, ప్రజల ఇండ్లలోను ప్రబోధించుచు మెస్సయాయైన యేసును ప్రకటించుట మానలేదు” (అపోస్తలుల కార్యములు 5:40-42) “అందుచే యూదయా, గలిలీయ, సమరియా సీమలందంతట క్రీస్తు శ్రీసభ నిర్మితమై శాంతి చేకూరెను. అది దేవుని యెడల భయభక్తుల తోడను, పవిత్రాత్మ సహాయము తోడను జీవించుచు అధిక సంఖ్యలో దినదినాభివృద్ధి చెందుచుండెను” (అపోస్తలుల కార్యములు 9,31).

**7. యేసు మరణం, పునరుత్థానం కేవలం యాదృచ్ఛికంగా జరిగిన సంఘటనలు కావు.** తాను సిలువ వేయబడి మరణిస్తానని, సమాధి చేయబడతానని, మృతుల్లో నుండి తిరిగి లేస్తానని యేసు ప్రవచించాడు, ప్రకటించాడు. (మార్కు 8,31; 9,30-31; 10,33-34) ఇందులో గమనించాల్సిన విషయం ఏమిటంటే, యేసు ప్రభువును యూదా పెద్దలు విచారించిన ఆ రోజు తెల్లవారుజామున ఆయనకు సిలువ వేయాలని వారు నిర్ణయించారు. కానీ సిలువ మరణ శిక్ష విధించడం యూదా మత పెద్దలకు సాధ్యపడదు. ఎందుకంటే, ఒకరిని సిలువ వేసి శిక్షించడం యూదా ధర్మశాస్త్రం ప్రకారం కుదరదు. అది రోమా సామ్రాజ్యపు శిక్ష. సిలువ మరణం, మూడవ రోజున పునరుత్థానుడు అవడం ద్వారా యేసు ప్రభు తన ప్రవచనాలు, బోధనలు సత్యమని నిరూపించారు. “ఎవడును నా ప్రాణమును తీసికొనడు. నా యంతట నేనే ధారపోయుటకును, దానిని మరల తీసికొనుటకును నాకు అధికారం కలదు.” (యోహాను 10,18). అలా అయితే, యేసు ప్రభు మరణ పునరుత్థానాల ద్వారా మానవాళికి రక్షణ సాధ్యమయింది అనే సత్యం కూడా నూటికి నూరుపాళ్ళు సత్యం, తిరుగులేని యదార్థం.

కాబట్టి, సహోదరీ సహోదరులారా, యేసు ప్రభు మనందరి పాప పరిహార్థం, రక్షణ కొరకు నిజముగా మరణించి పునరుత్థానుడయ్యాడని ఎటువంటి సంకోచం లేకుండా విశ్వసిద్దాం. సజీవుడు, పునరుత్థానుడు, ఏకైక లోక రక్షకుడు, మన దేవుడైన యేసు ప్రభు సాక్షులుగా జీవిద్దాం. ఆ విశ్వాసాన్ని ధైర్యముగా అందరికి ప్రకటిద్దాం.

**జీవము గలిగిన సజీవ దేవుని జీవస్వరం**
**మనలనందరిని జీవింపజేయును గాక. ఆమెన్.**

క్రీస్తు నందు మీ తండ్రి
**బిషప్ ప్రిన్స్ అంతోని**
ఆదిలాబాద్ గురుపీఠ మేత్రాణులు